కనుమరుగవుతున్న చారిత్రక ఆనవాళ్లు

- శిథిలమై మూతపడిన పోర్టు షిప్పింగ్ కార్యాలయం
- పాడైన తుఫాన్ సిగ్నలింగ్ వ్యవస్థ
- భవనాన్ని సంరక్షించాలని స్థానికుల ఆకాంక్ష

చారిత్రక కట్టడాలకు పేరుగాంచింది భీమునిపట్నం. వందల సంవత్సరాల నాటి నిర్మాణాలెన్నో ఇక్కడ కొలువుదీరాయి. కాలక్రమంలో ఆ కట్టడాలు కనుమరుగవుతున్నాయి. బ్రిటిషర్ల పాలనా కాలంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన పోర్టు షిప్పింగ్ కార్యాలయం వాటిలో ఒకటి. 1856లో నిర్మించిన ఈ భవనం శిథిలమై, మూతపడింది. ఈ భవనాన్ని పరిరక్షిస్తే చారిత్రక ఆనవాలుగా మిగులుతుందని, ఇటువంటి నిర్మాణాలను సంరక్షించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.



తుఫాన్ సిగ్నలింగ్ సామాగ్రి భద్రపరచుకునే గది ఇలా..

భీమునిపట్నం: భీమిలిలో బ్రిటిష్‌వారు ఏర్పాటు చేసిన పోర్టు షిప్పింగ్ కార్యాలయం పూర్తిగా శిథిలమైంది. దాని ఆధ్వర్యంలో నిర్వహించే తుఫాన్ సిగ్నలింగ్ వ్యవస్థ కూడా పాడై నిరుపయోగంగా మారింది.

కాకినాడ పోర్టు ఆధీనంలోకి..

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విశాఖలో పోర్టు ఏర్పడటంతో ఇక్కడి కార్యాలయం మూతపడింది. ఈ కార్యాలయం కాకినాడ పోర్టు ఆధీనంలోకి వెళ్లింది. వారు ఈ కార్యాలయంలో ఒక పోర్టు కన్జర్వేటర్‌ను, ఇద్దరు సిబ్బందిని నియమించారు. వారు ఇక్కడ లైట్‌హౌస్ నిర్వహణ చూసుకునేవారు. ఇందులో సిబ్బంది రోజూ సాయంత్రం లైట్ వెలిగించడం, ఉదయం ఆపడం చేసేవారు. పోర్టు కార్యాలయం పైన రెండు గదులు ఉండేవి. వాటిని సందర్శకులకు అద్దెకు ఇచ్చేవారు. దీనిపై నుంచి గోస్తని నది సముద్రంలో కలిసే సాగరసంగమం ప్రాంతం ఎంతో అందంగా కనబడుతుంది. దీంతో చాలామంది ఇక్కడ బస చేయడానికి ఆసక్తి చూపేవారు. దీనివల్ల మంచి ఆదాయం వచ్చేది.

మూతపడ్డ కార్యాలయం



శిథిలమై మూతపడిన పోర్టు షిప్పింగ్ కార్యాలయం

క్రమంగా ఈ కార్యాలయం దెబ్బతింది. అధికారులు పట్టించుకోకపోవడంతో పది సంవత్సరాల క్రితం మూతపడిపోయింది. కార్యాలయం లేకపోవడంతో సిబ్బంది కూడా ఇక్కడి పనులను పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం లైట్‌హౌస్ కేంద్ర ప్రభుత్వ లైట్ హౌట్, షిప్పింగ్ విభాగం ఆధీనంలోకి వెళ్లింది. దీంతో దానికి సంబంధించిన ఒక ఉద్యోగి ఉండగా, ఆయన లైట్‌హౌస్ నిర్వహణ చూస్తున్నారు. కానీ, తుఫాన్ వ్యవస్థను ఎవరూ పట్టించుకోకపోవడంతో అది పూర్తిగా పాడై, నిరుపయోగంగా మారింది. ఇప్పటికే అనేక చారిత్రక నిర్మాణాలు కనుమరుగైపోగా ఈ పోర్టు కార్యాలయం భవనాన్ని అయినా బాగు చేసి పరిరక్షించుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నారు.

తుఫాన్ సిగ్నలింగ్ వ్యవస్థ

బీచ్ సమీపంలో తుఫాన్ సిగ్నలింగ్ వ్యవస్థ ఉండేది. ఇక్కడ ఎత్తయిన స్తంభం ఉండగా తుఫాన్ వచ్చే సమయాల్లో దాని తీవ్రతను తెలిపే నంబర్ బుట్ట, జెండాను ఎగరవేసేవారు. అలాగే, రాత్రి వేళల్లో హెచ్చరిక లైట్లు వెలిగించేవారు. దాని ప్రకారం మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లేవారు కాదు.



పాడైపోయిన తుఫాన్ సిగ్నలింగ్ స్తంభం

అరుదైన నిర్మాణాలు



ఇక్కడ ఉండే చారిత్రక నిర్మాణాల వల్లనే భీమిలికి ప్రత్యేక గుర్తింపు. వీటిని చూడడానికే అనేక మంది సందర్శకులు ప్రత్యేకించి వచ్చేవారు. ఇప్పటికే అనేక అరుదైన నిర్మాణాలు కనుమరుగైపోయాయి. ఉన్న కొద్ది నిర్మాణాలు కూడా ఇక ఉండని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది ఎంతో బాధాకరం.

– చెల్లూరి గౌరినాయుడు, భీమిలి

1854లో లైట్‌హౌస్ నిర్మాణం

బ్రిటిష్ వారు పాలించే సమయంలో ఉత్తర, దక్షిణ భారతదేశానికి మధ్యలో ఉన్న భీమిలి తీర ప్రాంతం ఎగుమతులు, దిగుమతులకు అనువుగా ఉంటుందని గుర్తించి, ఇక్కడ పోర్టు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి ఓడల ద్వారా వస్తువులు, పంటలు, సుగంధ ద్రవ్యాల ఎగుమతి, దిగుమతులు చురుగ్గా జరిగేవి. ఓడల రాకపోకలకు దిక్సూచిగా ఉండేలా 1854లో బీచ్ సమీపంలో లైట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. ఇది వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది.



బీచ్ వద్దనున్న లైట్ హౌస్

పోర్టు షిప్పింగ్ కార్యాలయం ఏర్పాటు

ఇక్కడ జరిగే ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన వ్యవహారాలు నిర్వహించేందుకు 1856లో ఇక్కడి మున్సిపల్ కార్యాలయం పక్కనే పోర్టు షిప్పింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని రకాలైన ఎగుమతులు, దిగుమతుల వివరాలు.. ఆదాయ, వ్యయాలు, నిర్వహణ వ్యవహారాలు ఈ కార్యాలయం ద్వారానే అధికారులు నిర్వహించేవారు.

ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి



ఎంతో అరుదైన నిర్మాణాలు ఒక్కొక్కటిగా లేకుండా పోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే, ఉన్న కొద్దిపాటి నిర్మాణాలు మరికొద్ది రోజుల్లో ఉండవు. ఇక ఈ ప్రాంతం కూడా ప్రత్యేక గుర్తింపును కోల్పోతుంది. ప్రభుత్వం స్పందించి ఉన్న వాటిని పరిరక్షించాలి.

-పి.వి.రాఘవేంద్రరావు, హైదరాబాద్

క్లుప్తంగా

సీబీఎస్‌ఈ ఫలితాల్లో నవోదయ సత్తా



బాడిరెడ్డి సాయి చేరన్



ఒమ్మి రుక్మిణి

కొమ్మాది: సీబీఎస్‌ఈ మంగళవారం వెల్లడించిన పది, ప్లస్ 2 ఫలితాల్లో స్థానిక నవోదయ విద్యాలయ విద్యార్థులు శతశాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ డా.వైఎస్ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. 12వ తరగతిలో 36 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా 560 మార్కులతో ఒమ్మి రుక్మిణి, ఒ.ఉమ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పదవ తరగతిలో 79 మంది విద్యార్థుల్లో అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. వీరిలో బాడిరెడ్డి సాయిచేరన్(589), విడదల ధనుశ్రీ(586), బి.ప్రవీణ్(582) తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు వెల్లడించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల యాజమాన్యం అభినందించింది.

మత్స్యకారులకు మెరైన్ పోలీసుల సూచనలు



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మురళీకృష్ణ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో రుషికొండ మెరైన్ పోలీసులు సోమవారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మురళీకృష్ణ మత్స్యకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తీరప్రాంతాల్లో అపరిచితులు సంచరిస్తున్నప్పుడు తమకు గానీ, సమీప పోలీస్టేషన్లలో గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్స్యకారులతో భోజనం చేసి రాత్రి అక్కడే బస చేసి, తీరంపై నిఘా ఏ విధంగా ఉంచాలో వారికి తెలియజేశారు. కార్యక్రమంలో మెరైన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి సన్నిధిలో ఆలయ ట్రస్టీలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు పురాణం శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, ఆలయ ట్రస్టీలు పాల్గొన్నారు.


జట్లమ్మ ఉత్సవాలకు రూ.10వేలు విరాళం



ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న రవికుమార్

పద్మనాభం: పాండ్రంగి జట్లమ్మ ఉత్సవాల నిర్వహణకు రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవికుమార్ మంగళవారం రూ.10వేలు విరాళంగా అందజేశారు. పాండ్రంగి పంచాయతీ పరిధిలోని బర్లపేటలో ఉత్సవ కమిటీ సభ్యులు పల్లా అప్పలరాం, బర్ల వెంకటేష్‌లకు ఈ విరాళాన్ని నగదు రూపంలో అందించారు.

పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో స్వామి

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నిత్యపూజలు, అభిషేకాల అనంతరం తులసి మాలలు, వడలు, తమలపాకులు, నిమ్మకాయలు, పూలతో అలంకరించారు. ఆలయం వద్ద కొమ్మాది టీచర్స్ లే అవుట్‌కు చెందిన కెల్ల అభిరాం, దుర్గా భవానీల ద్వితీయ పుత్రిక శ్రీవిద్య జన్మదినాన్ని పురస్కరించుకుని మజ్జిగ చలివేంద్రానికి సహాయ సహకారాలు అందించారు. ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలను దర్శించుకున్న చిన్న శ్రీను

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో బంగారమ్మ, పాండ్రంగిలో జట్లమ్మ ఆలయాలను భీమునిపట్నం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. పాండ్రంగిలో జట్లమ్మ ఆలయ సన్నిధిలో మజ్జి శ్రీనివాసరావుకు ఉత్సవ కమిటీ సభ్యులు అముజూరి అప్పారావు, పల్లి మహేష్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



చిన్న శ్రీనుకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గంటా పూజలు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెడ్డిపల్లిలోని బంగారమ్మ, పాండ్రంగిలోని జట్లమ్మ ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

• నేత్రపర్వం.. అమ్మరూపం



భీమిలి మండలంలో గ్రామదేవతలు మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని పసుపు, కుంకుమ ప్యాకెట్లు, తులసిమాలలు, గజమాలతో నేత్రపర్వంగా అలంకరించగా.. దివీస్ రోడ్డులోని పాత చెరకుపల్లి, గుడివాడ గ్రామాల్లో తోగాలమ్మ, ముత్యాలమ్మ వార్లను పసుపు కుంకుమల వారాల సందర్భంగా విశేషంగా అలంకరించారు. పాత చెరకుపల్లి తోగాలమ్మ బంతి, గులాబీలు, కనకాంబరం, చామంతులు, తులసిమాలల అలంకరణలో దర్శనమీయగా.. గుడివాడ తోగాలమ్మ, ముత్యాలమ్మవార్లు గజమాలలు, జర్బరా పువ్వులతో దర్శనమిచ్చారు. - తగరపువలస

కొత్త వీఆర్పీని నియమించాలని కలెక్టర్‌కు వినతి

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామ పంచాయతీ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో వీఆర్పీ, పాత మేట్‌లు కలిసి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఫిర్యాదు చేయగా, ఒక వారం రోజులు మాత్రమే మార్పులు చేసి కొత్తవారిని నియమించారన్నారు. తర్వాత రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఎంపీడీవో జానకి, ఏపీవో వరలక్ష్మి తిరిగి పాతవారితోనే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. శివకృష్ణ అనే మేట్‌ను వీఆర్పీగా చేసి ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారన్నారు. కొత్త వీఆర్పీని నియమించాలని కోరుతూ వినతిపత్రంతో పాటు సంబంధిత ఆధారాలను జత చేసినట్టు ఉపాధిహామీ కూలీలు తెలిపారు.

వైభవంగా త్రిశక్తి అమ్మవార్ల అనుపు ఉత్సవం

మధురవాడ: కొమ్మాది జంక్షన్ త్రిశక్తి ఆలయంలో కొలువుదీరిన ముగ్గురమ్మవార్లు బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గా దండుమారమ్మ వార్ల జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మూడో రోజు మంగళవారం అనుపు ఉత్సవం సందర్భంగా బంగారమ్మ వారికి విశేష పూజలు చేశారు. మధురవాడ పరిసర ప్రాంత స్వయంకృషి నగర్, వికలాంగుల కాలనీ, డ్రైవర్స్ కాలనీ, అయ్యప్పనగర్, శివశక్తినగర్, బొట్టవానిపాలెం, నగరంపాలెం, చంద్రంపాలెం, తదితర 14 గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు విశేషంగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. పులిహోర, ఇతర నైవేద్యాలు సమర్పించి, భక్తులకు వితరణ చేశారు.



పూజలందుకున్న బంగారమ్మ వారు

ఫుట్‌పాత్ ఫుల్

కొమ్మాది: భీమిలి–విశాఖ బీచ్ రోడ్డు నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే రుషికొండలో మాత్రం ఓ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు మాత్రం ఏ కార్యక్రమం జరిగినా భారీగా వాహనాలను ఫుట్‌పాత్‌పై, రోడ్డుపై పార్క్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య భారీగా ఏర్పడుతుంది. ఈ ఫంక్షన్ హాల్ వెంబడి ఉన్న ఫుట్‌పాత్, ప్రధాన రహదారిపైనా పదుల సంఖ్యలో కార్లను పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఫుట్‌పాత్, రోడ్డుపై పార్కింగ్ చేసిన కార్లు

అంబరాన్నంటిన సిరిమాను సంబరం



రెడ్డిపల్లిలో సాంస్కృతిక కార్యక్రమాలు



పాండ్రంగిలో రాజ వీధిలో తిరుగుతున్న సిరిమాను

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఏడు గ్రామాల ఇలువేల్పు జట్లమ్మ సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముందుగా పాండ్రంగిలోని సతకం పట్టు నుంచి సిరిమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం ఐదు గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమైంది. పూజారి పాండ్రంగి నాగరాజు సిరిమాను అధిరోహించారు. సతకం పట్టు నుంచి రాజ వీధి గుండా కళిగర్ల వెంకటరావు ఇంటి వరకు సిరిమాను మూడు సార్లు తిరిగింది. ముందు అంజలి రథం, తర్వాత సిరిమాను, సిరిమాను వెనుక బూర్లె, వెన్నె, మైలపల్లి కుటుంబ సభ్యులు, భీమునిపట్నం మండలం నారాయణరాజుపేట గ్రామస్తుల తీసుకువచ్చిన రథం సాగాయి. భక్తుల జట్లమ్మ నామ స్వరాల నడుమ సిరిమానోత్సవం గంటన్నర సేపు జరిగింది. పాండ్రంగి పంచాయతీలోని ఈ గ్రామంతో పాటు బర్లపేట, కురపల్లి, ఏనుగులపాలెం, మునివానిపేట, పాత సామయ్యవలస, కొత్త సామయ్యవలస గ్రామాల ప్రజలతో పాటు పండగకు వచ్చిన వేలాది మంది బంధువులు సిరిమాను ఉత్సవాన్ని కనులారా వీక్షించారు. పులి వేషాలు, చిడతలు ఆకట్టుకున్నాయి.

రెడ్డిపల్లిలో ఘనంగా రథాల ఉత్సవం

రెడ్డిపల్లిలో బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా రథాల ఉత్సవం ఘనం జరిగింది. పుప్పాల వీధి నుంచి ప్రారంభమైన మూడు రథాలు రామాలయం వీధి, ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా మూడు సార్లు తిరిగాయి. రెడ్డిపల్లి పంచాయతీలో ఈ గ్రామంతో పాటు రామన్నపేట, భద్రయ్యపేట, సుంకర పేట, మర్రి బంద, గంగయ్య గారి కళ్లాలు, రెల్లిపేట, శేరిఖండం పంచాయతీ ఈ గ్రామంతో పాటు సంగు పేట గ్రామాల ప్రజలు రథాల ఉత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రెడ్డిపల్లిలోని బంగారమ్మ, పాండ్రంగిలో జట్లమ్మ ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు వీధులన్నీ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

అనుమానాస్పదంగా డ్రైవర్ మృతి



సురేష్ కుమార్ గణపతిలాల్ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ దొరతోట రోడ్డు పక్కన లారీని నిలిపి స్టీరింగ్‌పై అపస్మారకస్థితిలో పడి ఉన్న డ్రైవర్ సురేష్‌కుమార్ గణపతిలాల్‌ను సోమవారం రాత్రి పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పట్టణం పర్డి ప్రాంతానికి చెందిన అతడు వెల్లంకిలో ప్లై-వుడ్ ఫ్యాక్టరీలో లోడింగ్ చేసుకుని బయటకు వచ్చి ఈ స్థితిలో పడి ఉన్నాడు. నాగ్‌పూర్‌లోని కుటుంబ సభ్యులు సురేష్‌కుమార్‌కు ఫోన్ చేసినా స్పందించకపోడవంతో తెలిసిన వారి సాయంతో వెళ్లి చూశారు. అప్పటికే ఆయన చనిపోయినట్టు ఆనందపురం పోలీసుల సాయంతో గుర్తించారు. ఆహారం, నీరు లేకపోవడం, గుండె పోటు తదితర ఏదైనా కారణాలతో చనిపోయి ఉండవచ్చని ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణకు వచ్చారు. వెంటనే నాగ్‌పూర్ నుంచి మృతుని కుమారుడు దీపక్ సురేష్ ఇక్కడకు చేరుకుని ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

భీమునిపట్నం: భీమిలికి చెందిన మహిళ అదృశ్యంపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక కృష్ణాకాలనీకి చెందిన బంగారు కవిత(28)కు తొమ్మిది సంవత్సరాల క్రితం పైడిరాజుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా కొద్ది రోజులుగా ఈమె తన తల్లి పాడుగు వరలక్ష్మి ఇంట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో గత పదో తేదీన రేషన్ తీసుకువస్తానని ఇంట్లోంచి వెళ్లిన కవిత తిరిగి రాలేదు. దీనిపై తల్లి వరలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మెలో అన్ని వర్గాలు భాగస్వాములు కావాలి

మధురవాడ: కార్మిక వర్గానికి అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ రద్దు, ఇతర డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెలో మున్సిపల్, ఇతర రంగాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎంవీ ప్రసాద్ కోరారు. మంగళవారం మధురవాడ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు సీహెచ్ శేషుబాబు, జి.కిరణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి జగన్ సాయం అభినందనీయం



కేజీ రెడ్డి

తగరపువలస: ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా శత్రుమూకలను తుదముట్టిస్తూ వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదార్పు అభినందనీయమని భీమిలికి చెందిన శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కేజీ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాలో పర్యటించిన జగన్ మురళి తల్లిదండ్రులకు రూ.25 లక్షలు ప్రకటించి, మిగిలిన రాజకీయనేతల కంటే భిన్నంగా వ్యవహరించారన్నారు. కేవలం పరామర్శతోనే సరిపెట్టకుండా దేశం కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డ కుటుంబానికి భద్రత కల్పించడంలో ఆయన కొండంత పెద్ద మనసు చాటుకున్నారన్నారు. గతంలో కూడా ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు పలు సందర్భాలలో రాష్ట్రానికి చెందిన సైనికులు, మాజీ సైనికుల పట్ల గౌరవం ప్రదర్శించారని గుర్తు చేశారు. మురళీ నాయక్ కుటుంబం, మాజీ సైనికుల తరపున వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

'యుక్తధార'తో ఉపాధి హామీలో అవినీతికి చెక్

తగరపువలస: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీని అరికట్టే సంస్కరణలలో భాగంగా ఇకపై ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వమే నిర్వహించనుందని బీజేపీ నాయకులు అన్నారు. ఆనందపురం మండలం వెల్లంకిలో మంగళవారం నిర్వహించిన భీమిలి నియోజకవర్గ బీజేపీ నాయకుల సమావేశంలో ఈ పథకం ద్వారా జరుగుతున్న అవినీతిపై చర్చించారు. మండల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిధులు దుర్వినియోగం చేయడం ద్వారా దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. కొత్తగా యుక్తధార యాప్ ద్వారా ఉపాధి హామీలో లోపాలు సరిదిద్దబడతాయన్నారు. ఈ పటిష్టమైన చర్యల వలన లబ్ధిదారులకు నూరుశాతం ప్రయోజనం కలుగుతుందన్నారు. కొత్త యాప్‌లో ఏయే ప్రాంతాల్లో ఏయే పనులు ఎప్పుడు చేపట్టాలి, అంచనాలు, బిల్లు చెల్లింపులు అన్నీ నమోదవుతాయన్నారు. తొలి దశలో జిల్లా వ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారన్నారు. సమావేశంలో నాయకులు ప్రసాదరావు, విజయ, అప్పారావు, వెంకటరత్నం, జీవన్ సంతోష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



వెల్లంకిలో సమావేశమైన బీజేపీ నాయకులు